## బాధిత కుటుంబాలకు పరామర్శ



భాస్కర్‌ను పరామర్శిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జూన్ 14: మండలంలోని చాట్లపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కావ్యదుర్గయ్య తమ్ముడు మస్కూరి భాస్కర్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన చంద్రమౌళి రెండు రోజుల క్రితం మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. వారివెంట కొండపోచమ్మ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనరెడ్డి, నాయకులు కిరణ్, లక్ష్మణ్, భిక్షపతి, భూమల్ల రాజు, అంజి, బాలరాజు,నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోలుకోవాలని కోడె మొక్కు



చేర్యాల: వేములవాడ రాజన్నకు కోడె మొక్కు పూజ చెల్లిస్తున్న రాజేశ్‌గౌడ్

చేర్యాల, జూన్ 14: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిత్యం పాటుపడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూజలు చేస్తుండడంతో పాటు ముడుపులు కడుతున్నారు. శనివారం బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఆకుల రాజేశ్ గౌడ్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రాజన్నకు కోడె మొక్కు పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కోలుకోవాలని దేవుడికి ముడుపు కట్టినట్లు ఆయన తెలిపారు.

**లద్నూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ..**

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 14: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మద్దూరు మండలంలోని లద్నూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకొని ఎప్పటి మాదిరిగానే ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, దండు సోమక్కసోమన్న, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, మాజీ ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నంద శ్రీనివాస్, నాయకులు కాసర్ల కనకరాజు, రాపాక సిద్దారెడ్డి, ఇర్రి భూపాల్‌రెడ్డి, మానెపల్లి ప్రభాకర్, అన్నోజు శ్రీనివాస్, కనకచారి, మానెపల్లి సత్యం, బోయ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు(ధూళిమిట్ట): లద్నూర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## హుస్నాబాద్‌లో పోచమ్మ బోనాలు



హుస్నాబాద్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు

హుస్నాబాద్ టౌన్, జూన్ 14: హుస్నాబాద్ పట్టణంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శనివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డులోని గౌడకులస్తులు ప్రత్యేంగా వండిన బోనాలు తీసుకుని డప్పుచప్పుల మధ్య పోచమ్మవాడకు బయలుదేరారు. శివసత్తుల నాట్యాలతో బోనాల ఊరేగింపు పెద్దఎత్తున సాగింది. సాయంత్రం స్థానిక ఎల్లమ్మగుట్ట వద్ద ఎల్లమ్మ తల్లికి సైతం గౌడ కులస్తులు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పచ్చిమట్ల అంజయ్య, పూదరి వరప్రసాద్, పెరుమాండ్ల నర్సాగౌడ్, కక్కెర్ల రవీందర్, గట్టు కిష్ట, పూదరి రవీందర్, రవీందర్, పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, చంద్రమౌళి పాల్గొన్నారు.



లింగుపల్లిలో పిల్లర్ స్థాయిలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

## జీపీ భవనం పూర్తయ్యేనా

### పిల్లర్ల స్థాయిలో నిలిచిన జీపీ భవన నిర్మాణం

- **గ్రామ పంచాయతీ ఏర్పాటైనా సొంత భవనం లేక ఇక్కట్లు**
- **కమ్యూనిటీ హాలులో కొనసాగుతున్న జీపీ కార్యాలయం**

మిరుదొడ్డి, జూన్ 14: మిరుదొడ్డి మండలంలోని చెప్యాల గ్రామ పంచాయతీ మధిర గ్రామంగా కొన్నేండు కొనసాగిన లింగుపల్లిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్‌లో కొనసాగిస్తున్నారు. ఈ గ్రామంలో జీపీ భవనం నిర్మించడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి విడతలో రూ.10 లక్షల నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పిల్లర్ వరకు పనులు చేపట్టి అసంపూర్తిగా ఆపేశాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ పంచాయతీ భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్‌లో గ్రామ పంచాయతీ ఉండడంతో కులానికి సంబంధించిన వివిధ రకాల సమావేశాలు నిర్వహించుకోవడం ఇబ్బంది ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు లింగుపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధిని చాటుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.




కమ్యూనిటీ హాలులో కొనసాగుతున్న లింగుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

# లోక్ అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారం



హుస్నాబాద్ టౌన్: మెగా లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి రేవతి



గజ్వేల్: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి స్వాతిగౌడ్

హుస్నాబాద్ టౌన్, జూన్ 14: జాతీయ మెగా లోక్ ఆదాలత్ శనివారం హుస్నాబాద్ కోర్టులో నిర్వహించారు. 361 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రేవతి మాట్లాడుతూ.. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లోక్ అదాలతో రాజీపడ్డ తరువాత ఏ కోర్టుకు అప్పీలకు వెళ్లినా ఫలితం ఉండదని ఆమె చెప్పారు. ఇరువర్గాలు కోర్టుకు వచ్చి సత్వర న్యాయం పొందేందుకు ఇదొక చక్కటి అవకాశమని జడ్జి అన్నారు. లోక్ అదాలత్‌లో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు కన్నోజు రామకృష్ణ, ఏపీపీ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు ప్రవీణ్, భాస్కర్, అజయ్, రాజశేఖర్, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

**రాజీతోనే కేసుల పరిష్కారం**

గజ్వేల్, జూన్ 14: రాజీతోనే కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని గజ్వేల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్ అన్నారు. శనివారం గజ్వేల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న గొడవలతో కేసుల నమోదు వరకు వచ్చిన వారు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెక్ బౌన్స్, బ్యాంకులో రుణాలు, పొలాల వద్ద గొడవలు, చిన్న కారణాలతో గ్రామాల్లో పరిష్కరించుకోకుండా కేసులు నమోదైన వారు పరిష్కరించుకోవాలని సూచించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈసారి గజ్వేల్‌లో 963 కేసులు పరిష్కారమైనట్లు జడ్జి తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నర్సింహులు, న్యాయవాదులు,కక్షిదారులు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో 317 కేసులు పరిష్కారం**

చేర్యాల, జూన్ 14: చేర్యాల మున్సిఫ్ కోర్టు పరిధిలో 317 కేసులు పరిష్కారమైనట్లు చేర్యాల మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి రేవతి తెలిపారు. శనివారం చేర్యాల మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 39 క్రిమినల్ కేసులు, 4 సివిల్ కేసులు, 2 ఎక్సైజ్ కేసులు, 20 బ్యాంకు కేసులు, 6 ఐటీ కేసులతో పాటు 317 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. 258 కేసుల్లో జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి రేవతి మాట్లాడుతూ.. చిన్న విషయాలకు తగాదాలు పడి అనవసరంగా పంతాలకు పోకుండా ఇరువర్గాలు రాజీ కుదుర్చుకొని లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.



సిద్దిపేట టౌన్: మోటారు ప్రమాద బాధితురాలికి పరిహారం అందిస్తున్న న్యాయమూర్తి జయప్రసాద్

**లోక్ అదాలత్‌కు విశేష స్పందన**

సిద్దిపేట టౌన్, జూన్ 14: రాజీయే రాజమార్గం..రాజీ పడితే ఇద్దరు గెలిచినట్లే అని న్యాయమూర్తి జయప్రసాద్ అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట కోర్టు ఆవరణలో శనివారం రాత్రి వరకు జరిగిన లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదాల్చిన అన్నిరకాల కేసులు ఇరువురు సమ్మతితో రాజీ కుదుర్చి ఉపశమనం కల్పించారు. జాతీయ లోక్ అదాలత్‌లో 4274 క్రిమినల్ , 32 సివిల్, 9 మోటార్ ప్రమాద కేసులు పరిష్కరించారు. ముఖ్యంగా మోటారు ప్రమాద బాధితులు కోటి 29లక్షల 62వేల రూపాయల పరిహారం రూపంలో అందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జయప్రసాద్ మాట్లాడుతూ..క్షణికావేశంలో చేసిన నేరాలను, పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చక్కని వేదిక లోక్ అదాలత్ అని అన్నారు. ఒక్కసారి లోక్ అదాలత్‌లో రాజీ పడితే తిరిగి మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం లేదన్నారు. ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు, సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు మిలింద్ కాంబ్లే, సంతోష్‌కుమార్, సాధన, తరణి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానానికి ముందుకు రావాలి

- **సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు**



రక్తదాతను సన్మానిస్తున్న రాజనర్సు

సిద్దిపేట, జూన్ 14: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానంతో ప్రాణాలు నిలుపవచ్చని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో రక్తదాతలను సన్మానించారు. రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించి శాలువాలతో సత్కరించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్, స్థానిక కౌన్సిలర్ వడ్లకొండ సాయి కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణి, ఆర్‌ఎంవో సదానందం, టెక్నికల్ సూపర్‌వైజర్ చంద్రం, బీఆర్‌ఎస్ నాయకులు పిండి అరవింద్, పవన్, దాతలు కానిస్టేబుల్స్ శ్రీనివాస్, దాసరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**రక్తదానం ప్రాణదానంతో సమానం**

సిద్దిపేట టౌన్, జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఎన్‌సీసీ అధికారి కృష్ణయ్య, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి సదానందం అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 72 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రక్తదానంపై ఎలాంటి అపోహలు వద్దని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివాని, కనకచంద్రం, అంజయ్య, శ్రీనివాస్, ప్రణీత్, రమేశ్, బాలాగౌడ్, బేతయ్య తదితరులు పాల్గొన్నారు.




సిద్దిపేట టౌన్: రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

## సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం



చేగువేరా జయంతి నిర్వహిస్తున్న నాయకులు

చేర్యాల, జూన్ 14: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి ఎస్‌కే యాసిన్ ఆరోపించారు. శనివారం పట్టణంలో కామ్రేడ్ చేగువేరా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం యాసిన్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, విద్యార్థి ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.సమాజంలో అసమానతలు తగ్గించడం, దోపిడీపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మంగోలు తేజ, ఎర్రమైసగల్ల లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.




సిద్దిపేటలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## భద్రత మా బాధ్యత

సిద్దిపేట టౌన్, జూన్ 14 : మహిళల భద్రత మా బాధ్యత అని షీటీమ్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై కిషన్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో శనివారం మహిళలకు చట్టాలపై, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులను మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. యువత గంజాయి,మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. మహిళలకు ఏ రకమైన ఇబ్బందులు ఎదురైనా మౌనం వీడి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ సిబ్బంది లక్ష్మీనారాయణ, ప్రవీణ్ మమత, రజని పాల్గొన్నారు.

## ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

బెజ్జంకి, జూన్ 14: జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించి, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రాజు, పరశురాములు, బాలయ్య, భూమయ్య, లక్ష్మణ్, ప్రసాద్, చంద్రయ్య, స్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

## నిత్యజీవితంలో యోగా భాగం చేసుకోవాలి



సిద్దిపేట టౌన్, జూన్ 14: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వ్యాస మహర్షి యోగా శిక్షకులు తోట సతీశ్ అన్నారు. సిద్దిపేటలోని గణేశ్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఉచిత యోగా శిక్షణ తరగతులు 5వ రోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా శిక్షకుడు సతీశ్ సాధకులతో యోగాసనాలు సాధన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కాటం శోభ రఘురాం, సాధకులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లు

కొమురవెల్లి, జూన్ 14: స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొమురవెల్లి ఎంఈవో రమేశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి తెలంగాణలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్స్‌లో నాలుగో తరగతిలో అడ్మిషన్‌కు 01 సెప్టెంబర్ 2016 నుంచి 31 ఆగస్టు 2017 మధ్య జన్మించి 2024-25 విద్యసంవత్సరంలో 3వ తరగతి పూర్తిచేసినవారు అర్హులని, ప్రతి స్కూల్‌లో బాలురకు 20, బాలికలు 20 సీట్లు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న విద్యార్థులకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు.


**స్పోర్ట్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం**

రాయపోల్ జూన్ 14: స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయపోల్ ఎంఈవో సత్యనారాయణ రెడ్డి శనివారం తెలిపారు. దరఖాస్తులు satgasc.telangana.gov.in వెబ్‌సైట్‌లో 15 జూన్ 2025 లోగా అప్లై చేయాలని సూచించారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 14: స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మద్దూరు, ధూళిమిట్ట ఎంఈవోలు వరదరాజు, మాడిశెట్టి మీనాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు




రాయపోల్, జూన్ 14: రాయపోల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం,కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణకు సంబంధించిన గడువును ఈనెల 16 వరకు పొడిగించినట్లు ఎంఈవో సత్యనారాయణ రెడ్డి తెలిపారు. రాయపోల్ కేజీబీవీ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎమ్ఎల్‌టీ రెండు గ్రూపులకు సంబంధించిన పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దీనికి సం బంధించి ఇంగ్లిషు పోస్టుకు ఎంఏ ఇంగ్లీష్, బీఈడీ చేసిన వారు, ఎంపీహెచ్‌డబ్ల్యూ సబ్జెక్ట్ బోధించుటకు బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు, ఎమ్ఎల్‌టీ సబ్జెక్ట్ బోధించుటకు ఎమ్మెస్సీ (మైక్రో బయాలజీ), ఎమ్మెస్సీ (బయో కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (జెనెటిక్స్), లేదా బీఫార్మసీ, ఎంఎస్సీ (ఎమ్మెల్టీ), ఎంబీబీఎస్ (హెచ్‌ఎంవో), బీహెచ్‌ఎంఎస్ పూర్తి చేసిన వారు దరఖాస్తులు కేజీబీవీ పాఠశాల కార్యాలయంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం అందజేయాలని సూచించారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 14: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ధూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాలో చోటు చేసుకుంది. మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ వివరాల ప్రకారం.. రెడ్యానాయక్ తండాకు చెందిన జాటోతు చందు(50) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. చందు జీవితంపై విరక్తితో ఈనెల 10న పురుగుల మందు తాగడంతో ఇరుగుపొరుగు వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అతన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ విషమించి శనివారం మృతిచెందాడు. మృతుడి అన్న కొడుకు తిరుపతి ఫిర్యాదు మేరకు మద్దూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌కు మోక్షమెప్పుడో?

- **ఏడాది క్రితం నిర్మాణ పనులు పూర్తి**
- **లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోతున్న మార్కెట్ కమిటీ**
- **పట్టణంలో షటర్లకు గిరాకీ**

చేర్యాల, జూన్ 14: రూపాయి ఆదాయం లేదు... నన్ను కోసుకుని తింటారా అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలు.ఆదాయం వచ్చేందుకు బీఆర్‌ఎస్ సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణ పనులు పూర్తి చేసినా, ప్రారంభించేందుకు కాంగ్రెస్ మంత్రులకు సమయం దొరకడం లేదు. చేర్యాల షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించే సమయం సంబంధితశాఖ మంత్రులు,అధికారులకు లేకుండా పోయింది.నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న కాంప్లెక్స్‌ను ఓపెన్ చేసి వ్యాపారులకు అద్దెకు ఇస్తే ప్రతినెలా చేర్యాల మార్కెట్ కమిటీకి లక్షల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం, అధికారులు అలసత్వం మూలంగా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినెలా లక్షల రూపాయల అద్దె కోల్పోతున్నది. రూ.1.50 కోట్లతో పట్టణంలోని చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు భాగంలో జాతీయ రహదారి వెంబడి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్(20 షెటర్లు) నిర్మాణం పూర్తిచేసుకుని ఏడాదిగా ఓపెనింగ్ కోసం ఎదురుచూస్తున్నాయి. చేర్యాల మార్కెట్ యార్డుకు ప్రతి నెలా ఆదాయం సమకూర్చేందుకు బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ వహించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఏప్రిల్ 6, 2022లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.మూడేండ్ల క్రితం ప్రారంభమైన పనులు గత అసెంబ్లీ ఎన్నికల ముందే పూర్తయ్యాయి.నాడు ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రారంభం కాలేదు.అసెంబ్లీ ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం కాలేదు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైతం మార్కెట్ యార్డుకు ఎంతో ఉపయోగపడే, ఆదాయం లభించే షాపింగ్ కాంప్లెక్స్ వెంటనే ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. కొన్ని నెలల క్రితం ప్రారంభించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపడితే అధికార పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం మధ్యలోనే ఆగిపోయింది.

**ఆదాయం కోల్పోతున్న మార్కెట్ యార్డు**

పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అవతరించిన చేర్యాల పట్టణం నాలుగు దిక్కుల రోజురోజుకు విస్తరిస్తున్నది. దీంతో చేర్యాలలో షెటర్లకు డిమాండ్ ఉంది. మార్కెట్ యార్డుకు సమీపంలో కోర్టుతో పాటు తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు సైతం చివరి దశకు చేరుకున్నాయి. జాతీయ రహదారికి అనుకుని ఒకేచోట 20 షెటర్లతో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక్కో షెటర్ రూ.5వేలు నెలకు పలికే అవకాశం ఉంది. 20 షెటర్లకు నెలకు రూ. లక్ష ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం, మార్కెట్ పాలకవర్గం అలసత్వంతో చేర్యాల మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ లక్షల్లో ఆదాయం కోల్పోతున్నది. చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గం షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించేందుకు ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు కార్యదర్శి శ్రద్ధ వహించి వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**ఆదేశాలు రాగానే ప్రారంభం..**

షాపింగ్ కాంప్లెక్స్‌లో కొన్ని రోజుల క్రితం వరకు ఎలక్ట్రికల్ సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల పెండింగ్‌లో ఉన్న కరెంటు సంబంధిత పనులు పూర్తి చేయించాం.మినిస్ట్రీ నుంచి ఆదేశాలు రాగానే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించేందుకు మార్కెట్ కమిటీతో పాటు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

–రూప్‌సింగ్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్, చేర్యాల




చేర్యాలలో ప్రారంభానికి నోచుకోని వ్యవసాయ మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్